19

# తీరిన కోరిక

పగలంతా ప్రయాణం చేసిన సూర్యుడు విశ్రాంతి కోసం కాబోలు పశ్చిమాన కొండల మధ్య నున్న తన నివాసంలోకి ప్రవేశిస్తున్నాడు. దూరంగా ఎత్తుగా కనిపిస్తూ పక్క పక్కనే వున్న రెండు కొండలు ఇంటి ముఖ ద్వారంలా వున్నాయి. యజమాని మాట వినని నౌకర్లలా చుట్టూ చీకట్లు కమ్ముకుంటున్నాయి.

ఆ సమయంలో నడిపయ్య ఊరవతల మట్టి రోడ్డు మీద వున్న తూము మీద కాళ్ళు వ్రేలాడవేసి కూర్చుని వున్నాడు. అతని మెదడులో రక రకాల ఆలోచనలు వికృత రూపాల్లో వున్న రాక్షసుల్లా చెలరేగుతున్నాయి. శరీరం మాత్రం దీర్ఘ తపస్సులో వున్న మునిలా కదలక మెదలక పడి వుంది.

పని పాటలు చేసుకుని ఇళ్ళకు వెళుతున్న కూలి జనం "ఏంది నడిపయ్యా సీకటి పడ్డా ఇంకా కూసొని వుండవు" అంటూ పలకరించారు.

నడిపయ్య ఏం మాట్లాడలేదు. "వత్తుండా" అని మాత్రం అనగలిగాడు

నిజానికి అతనికి ఇంటికి పోవాలని లేదు కొడుకు ఐకొన్కిడికి నిండా జ్వరం. వాడికెదురుగా కూర్చొని తన పెళ్ళాం ఏడుపు. ఊళ్ళోకి వెళ్ళి ఆ నరకయాతన అనుభవించాలని లేదు. అందుకే అక్కడే వుండిపోయాడు.

ఐకొన్కిడికి రెండు రోజుల నుంచి ఒళ్ళు తెలియని జ్వరం. ఆ జ్వరంలో ఒకటే కలవరింతలు 'నాకు బండి తెచ్చియ్యరో అయ్యా... నాకు బండి తెచ్చియ్యరో అయ్యా' అంటూ.

ఆ గూడెంలో మొత్తం యాభై ఇళ్ళున్నాయి. అందరూ కూలి, నాలి చేసుకునే జనాలే. అందరూ పిల్లల్ని ఇంటి దగ్గర వదిలేసి కూలికి వెళ తారు. ఇక అక్కడ మిగిలేది పదేళ్ళ లోపు పిల్లలు. వాళ్ళు తమకంటే చిన్నపిల్లల్ని ఎత్తుకొని ఆడిస్తూ వుంటారు

నడిపయ్యకు ఒక్కడే కొడుకు బక్కోడు. నడిపయ్య దంపతులు కూలికి వెళ్ళేప్పుడు బక్కోడ్ని కూడా మిగతా పిల్లలతో వదిలేవారు. సాయంత్రం వచ్చి వాడ్ని ముద్దు చేసేవారు.

ఒకరోజు రాత్రి ఆకాశం పండు వెన్నెల కాస్తోంది. చల్లని గాలి పొద్దస్తమానం శ్రమించిన శరీరాల్ని ఓదారుస్తోంది.

ఆ సమయంలో బయట నులక్కమంచం మీద వెల్లకిలా కాళ్లు చాపి పడుకుని బక్కోడితో పరాచికాలాడుతున్నాడు నడిపయ్య.

"నా వరాల అయ్యవిరా నువ్వు. రతనాల మూటవి. ముద్దియ్యమ్మా..." ముద్దు చేస్తున్నాడు కొడుకుని.

"అయ్యా ముద్దిత్తను గాని, నాకొకటి తెచ్చియ్యాలే"

"ఏట్రా అది నా బంగారు కొండా"

"నువ్వు తెచ్చిత్తానంటే సెప్తానయ్యా"

"నువ్వడిగింది కాదంటానట్రా. ఏం కావాలో సెప్పు. బంగారం గావాల్నా... బిల్లంగోడు గావాల్నా... గోళీకాయలు గావాల్నా సెప్పు" గారంగా అడిగాడు నడిపయ్య.

"ఆయన్నీ కాదే..." అన్నాడు తండ్రి గుండెల మీద చేత్తో రుద్దుతూ.

"ఏటో సెప్పరాదట్రా బుజ్జీ" బ్రతిమాలాడు నడిపయ్య.

"తెచ్చియ్యాలి మరి"

"సెప్పాను గదరా తప్పకుండా తెచ్చిత్తానని"

"అయితే నాకు మూడు సెక్రాల చెక్క బండి కావాల్నే అయ్యా. రోజూ నెట్టుకుంటూ ఆడుకుంటానే" అన్నాడు మురిపెంగా బక్కోడు.

నడిపయ్య గడ గడా వణికిపోయాడు.

"ఎట్రా నీ కోరిక. కూలి సేత్తేనే సాయంత్రానికి నోట్లోకి ముద్ద పోదు. అంతంత పెద్ద కోరికలు పెట్టుకోమాకురా. ఏదన్నా పావలా పది పైసల్తో వచ్చేది అడగరా తెచ్చిత్తాను."

"నాకయన్నీ ఏమొద్దు. మనం గూడెంలో ఆ రంగడికి వుంది బండి. అట్టాటిది తెచ్చియ్యి నాకు" అంటూ మారం పెట్టి ఏడవ సాగాడు.

నడిపయ్యకి బాధగా వుంది. బక్కోడు అలాంటి కోరిక కోరినందుకు పొద్దస్తమానం కూలి చేస్తేనే ఆ రోజుకి ఇంత కడుపులోకి పోతుంది అట్లాంటిది తను పదిరూపాయలు ఖర్చుపెట్టి బుడ్డోడికి కొయ్య బండి చేయించగలడా.

నడిపయ్య మాట్లాడక పోయేసరికి బక్కోడు ఏడుపు మొదలుపెట్టాడు. ఆ ఏడుపు అంతకంతకూ తారాస్థాయి నందుకోసాగింది.

"ఒరే ఏడుపు ఆపరా నాయనా" అంటూ నడిపయ్య ఎంత బుజ్జగించినా వాడు ఏడుపు ఆపలేదు.

ఇంతలో పొయ్యి దగ్గర్నుంచి లేచి బయటికి వచ్చింది యర్రమ్మ కళ్ళు నులుపుకుంటూ.

"ఏందయ్యా బుడ్డోడ్ని అట్టా ఏడిపిత్తావు. అదీ ఓ ముచ్చటేనా" అంటూ వాడ్ని జవిరి చంకనేసుకుంది.

"నాను ఏడిపిచ్చినానా. ఆడు నన్నేడిపిస్తుండడా. ఆణ్నే అడిగి కనుక్కో తెలుస్తది."

యర్రమ్మ తన చంకలో క్రిందికి జారుతూ చేతులతో, కాళ్ళతో తపా తపా కొట్టుకుంటున్న ఒక్కోడ్ని బుజ్జగించసాగింది.

"ఒరే నాయనా ఏడవబాకరా నా బుజ్జితండ్రీ! అదో సూడు సంద మామ నీకేసి చూసి నిన్ను పిలుత్తుండాది. నువ్వూ సందమామ కలిసి గెంజి తాగి హాయిగా ఆడుకోండ్రా అయ్య మంచోడు కాదు. అయ్యను కొడదాంలే. అయ్యకి ఈ పూట గంజిలే. వాత పెడదాం ఏం" అంటూ వాడ్ని మరపించడానికి ప్రయత్నిస్తోంది యర్రమ్మ. బుజ్జగించే కొద్దీ వాడికి ఏడుపు ఎక్కువ కాసాగింది

"అయ్యా... మరే... మూడు సెక్రాల బండి అడిగితే సేయించ నన్నాడే... నాకది కావాల్నే అమ్మా... అ...అ..." అంటూ గుక్క పట్టి ఏడవసాగాడు.

యర్రమ్మ కూడా వాడి కోరికకు ఉలిక్కిపడింది. గుమాస్తాగాడి కొడుకు ఇంపాలా కారు కోరినంత దిగులుపడిపోయింది. ఎందుకు పుట్టింది ఈడికి ఇంత ఇలువయిన కోరిక అని మనసులోనే ఆలోచించింది. అప్పుడు తట్టింది ఆమెకు. తన గూడెంలోని పరదేశి తన కొడుక్కి అలాంటి చక్రాల బండి తెచ్చాడని అది చూసి వీడు ఏడుస్తున్నాడని.

అంతలోనే ఆమెకు దిగులు కూడా పుట్టింది. పరదేశి విషయం వేరు. ఆడికి ఏటిగట్టు మీద పాతిక సెంట్లు మిరపతోట వుంది అదిగాక ఆడింట్లో సంపాదించేవోళ్ళు శానామంది వున్నారు. ఆడూ ఆడి పెళ్ళామే గాక ఆడి తల్లి ఇక ఆడి పెద్ద కొడుకయితే ఎప్పుడూ ఆ కయ్యి దగ్గరే వుంచి ఆ పాతికసెంట్లలో మిరపచెట్లు,దోసకాయలు, శెనక్కాయలు, ఒక్కో సీజన్‌లో ఒక్కోటి పండిస్తుంటాడు. అందుకే ఆడికి ఆదాయం జాస్తి. కాబట్టి పరదేశి తన కొడుక్కి బండి కొనగలిగాడు.

యర్రమ్మ ఆలోచనల్లోంచి బయటపడి కొడుకు నుదురు మీద ముద్దు పెట్టుకొంటూ "ఒరే బుడ్డోడా! అంతేకదా! అత్నే రేపెళ్ళి పరదేశి యాడ తెచ్చిండో కనుక్కొని నీకూ ఓటి తెచ్చిత్తాలే...ఏం? ఏడవమాక" అంటూ వాడ్ని ఓదార్చింది

దాంతో బక్కోడు మహా సంబరపడిపోయాడు. "అయ్యా! ఇన్నావ అమ్మ సెప్పింది. నాకు బండి కొనిత్తాదంట. నేనింక నీతో పలకను. నువ్వొట్టి ఎదవ్వి, కుక్కవి" అంటూ వాడు గూడెంలో ఆ వయసులో తాను నేర్చుకున్న విజ్ఞానాన్ని ప్రదర్శించాడు.

నడిపయ్య లేచి కూర్చుని తుపుక్కున క్రింద ఉమ్మేశాడు. "దీ నవ్వ. ఇది నీకు బండి కొనిసద్దంటనా. దీని తాత ముల్లె గుడిసెలో ఏడ బూడ్చి పెట్టిందంట. తెమ్మను నాయాల్ని" అంటూ రంకెలు వేశాడు కోపంగా.

యర్రమ్మకు ఒళ్ళుమండిపోయింది. "ఏందీ తమాసా తెల్దియు. నిజం తెల్దియు నా తాతముల్లె ఎక్కడా పూడ్చి పెట్టలేదుగానీ, నీయవ్వముల్లె ఏడ యాలాడగట్టినవో సెప్పు. సేతగానోడికి కోపమెక్కువని వాడికి సర్ది చెప్పడం కూడా సేతగాదు. సవటని...సవటని గట్టుకుని ఏగతుండా పదేళ్ళనుంచి"

యర్రమ్మ మాటలకు నడిపయ్య సరసం విరసమౌతుందని గ్రహించి "గంజేయే. కడుపులో ఆకలి కరకర పెరకతా వుండాది. ఆ సంగతి సూడు ముందు" అన్నాడు.

"అవును. నీకు కడుపు కాలీగావుంటే నోటినిండా మాటలొస్తయి. ఈడ్ని ఎత్తుకో. పచ్చిపులుసు చేత్తా గంజిలో నంచుకోను" అంటూ కొడుకుని అందించింది.

నడిపయ్య వాడిని ఎత్తుకోబోతే "ఛ...ఫో...నేన్రాను నువ్వు ఎదవ నాయాలువి. అమ్మ మంచిది. అమ్మ పక్కనే నేనూ కూసుంటా.

నేను నీ దగ్గరకు రాను" అంటూ చంక దిగి తల్లి వెంట గుడిసెలోకి నడిచాడు.

బక్కోడి ముద్దు ముద్దు మాటలకు నడిపయ్య ఆనందంగా నవ్వు కొన్నాడు. 'ఎదవనాకొడుకు, ఎక్కడ నేర్చిందో ఇన్ని మాటలు' అను కొన్నాడు.

యర్రమ్మ అటికలో పచ్చి మిరపకాయలు నలిపి దాంతో చింత-పండు కలిపి పచ్చిపులుసు చేస్తుంటే ఎదురుగా కూర్చొని చూస్తూ వుండి పోయాడు బక్కోడు.

అందరూ బయట వెన్నెల్లో చాప వేసుకుని కూర్చున్నారు. ముంతలోని నూకల గంజిని తాగుతూ మధ్య మధ్యలో పచ్చి పులుసు నంచుకుంటూ రెండు నిమిషాల్లో ఖాళీ చేశారు గిన్నెల్ని. ఈ లోపల ముంతలోని గంజి ఖాళీ చేసి మూతి కడుక్కుంటున్నాడు బక్కోడు.

"నాయనా బక్కయ్యా అటూ ఇటూ రవంత సేపు తిరుగు. నేను గంజి తాగొచ్చి నీకు పక్కేస్తా" అంది యర్రమ్మ.

"అట్నే లేయే అమ్మా" అంటూ చొక్కా లేకుండా నడుంమీద వ్రేలాడుతున్న లాగు విప్పి దూరంగా పడేశాడు బక్కోడు. ఇప్పుడు బానలాంటి కడుపును మోయలేక మోస్తూ పుల్లల్లాంటి కాళ్ళుచేతుల్ని అటూ ఇటూ ఆడిస్తూ తిరుగుతున్నాడు.

వాడికి మహదానందంగా వుంది. రేపు తనకు తల్లి కొనియ్యబోయే మూడు చక్రాలబండి, దానివల్ల తాను పొందబోయే ఆనందం వాడ్ని ఒక చోట నిలవనీయడంలేదు.

ఆ రాత్రి బక్కోడ్ని మంచంమీద పడుకోబెట్టి నిద్రపుచ్చి, క్రింద చాపమీద వెల్లికిలా పడుకుని దున్నపోతులా గుర్రుపెట్టి నిద్రపోతున్న మొగుడు డొక్కలోకి ఒదిగి పడుకొంది యర్రమ్మ.

• • • •

మరుసటిరోజు పరదేశి ఇంటికి వెళ్ళింది యర్రమ్మ. ఆ సమయంలో పరదేశి పెళ్ళాం నాగులు బయట అంట్లు తోముతోంది. పరదేశి వేపపుల్ల నోట్లో పెట్టుకుని అరగతోముతూ పెళ్ళాన్ని చూస్తున్నాడు. పరదేశి రెండో కొడుకు ఆరేళ్ళ రంగడు మూడు చక్రాల బండి నెట్టుకుంటూ గుడిసెముందు ఆడుకుంటున్నాడు. ముచ్చటగా వాడివైపు చూసింది.

"ఏందే ఎర్రా అట్టా సూత్తవు. సిన్నప్పటి గాపకాలు గుర్తొచ్చినయా ఏంది?" హాస్యమాడాడు పరదేశి.

యర్రమ్మ పలకలేదు.

"కూసో యర్రమ్మా. ఇయ్యాల ఏడికి పనికి పోతుండవు" నాగులు పలుకరించింది.

"నాను రెడ్డిగారి సేలో నారేతలకి పోతుండానక్కా"

"ఏందియ్యాల ఇట్టా వచ్చినవు సెంగు ఎగదోపుకుని" నవ్వుతూ అడిగాడు పరదేశి.

"నీతో సరసలాడదామని వచ్చినాను మామా"

"నేను దానికోసమే ఎదురు సూత్తుండా మీ అక్క కూడా ముసల్దయిపోయె. ఇయ్యాల నుండి ఈడనే వుండిపో. నడిపోది కూడా ఓపిక తగ్గిపోయినట్టుండాది" పకపకలిస్తూ అన్నాడు పరదేశి.

"ఆ! నా ఒక్కదానికి సక్రమంగా పెడితే చాలు ముద్ద. మళ్ళీ ఇంకొకటి గావాల్నంట" అంది నాగులు మొగుడ్ని వెక్కిరిస్తూ

"ఏందే ఇంతకాలం నేనుగాక మరెవుడు పెడుతుండడు నీకు. నీకే కాదే. ఇంకో నలుగురి కూడా పెడతానే కండజూసి మాట్లాడు" అన్నాడు పరదేశి జబ్బలు చరుస్తూ.

"ఏళాకోళం తరువాత ఆడుకొందాంగాని పొద్దెక్కి పోతుండాది.

నాకే సంగజెప్పు" అంది యర్రమ్మ. అప్పుడే అక్కడి వరకు నెట్టుకుంటూ వచ్చిన రంగడి బండి పట్టుకుని ఆపుతూ—

"ఏటది"

"ఇది ఏడదెచ్చినవు మావా"

"అదా అది నేను తేలేదు. మా పెద్దోడు టౌను కెళ్ళి తెచ్చిండు" అంటూ "ఒరే కొండా" అంటూ అరిచాడు.

బారెడు పొద్దెక్కినా గుడిసెముందు కుక్కి మంచంలో దుప్పటి కప్పుకుని వున్న కొండయ్య రెండు మూడు కేకలకు ముఖం మీద దుప్పటి తొలగించి "ఏందెహె... హె. ఎర్రికేకలూ నువ్వూ గొంతెల్లి అరిచినట్టు ఏం గావాల" అనడిగాడు విసుగ్గా.

"ఈ ఈ మూడు సెక్రాల బండి ఎంత?"

"పదేన్రూపాయలు" నిర్లక్ష్యంగా అని మళ్ళీ దుప్పటి ముసుగులో దూరిపోయాడు.

యర్రమ్మ గుండె ఝల్లు మంది. పదేన్రూపాయలు. ఒకరూపాయా, రెండు రూపాయలూ గాదు. తను కొనగలదా. తమవి కూలి బతుకులు. కూలి సేత్తేనే నోట్లోకి నాలుగేళ్ళు పోతయి. ఒకపూట తినకపోతే రెండో పూట కళ్ళు తేలిపోతయి. పని చేయలేరు. అలాంటిది తాము బక్కోడికి పదేన్రూపాయలు పెట్టి బండి కొనడం దండగే కాకుండా అనవసరం అనుకుంది. ఆలోచనల్లోంచి బయటపడి ఇంటివైపు మరలింది.

బక్కోడు నోరు తెరుచుకొని ఆశగా ఎదురుచూస్తున్నాడు. నడి పయ్య పొయ్యిలోకి కంపమండలు నరుకుతున్నాడు. వస్తున్న తల్లికి పరు గెత్తుకొని ఎదురువెళ్ళి కౌగలించుకున్నాడు బక్కోడు.

"ఛ—ఆ బండేం బాగలేదురా. సూస్తుండు. సాయంత్రం నీకు భలే బండి తెత్తా" అంది కొడుకు తల నిమురుతూ.

"వద్దే. నా కట్టాటి బండే కావాల. ఇంకే బండీ వద్దే" ఏడుపు అందుకున్నాడు బక్కోడు.

"అట్టాగేలేరా తెత్తానన్నదిగదా. సాయంత్రం తెసద్దిలే" అన్నాడు నడిపయ్య.

"ఎట్టయినా పొద్దుగూకి నాకు బండి తేవాల. లేకపోతే నే నొప్పుకోను."

"అట్టాగేలేరా. సెప్పింది గదా మీయమ్మ తప్పకుండా సాయంత్రం తెస్తదిలే. మీయమ్మను గంజి కాయనీ పనికి ఎల్లొద్దా మేము" విసుక్కున్నాడు నడిపయ్య.

బక్కోడు యర్రమ్మ కొంగు పట్టుకుని వెనకనే తిరుగుతూ ఉన్నాడు. ఆమె గంజి కాసేంతవరకూ. ముగ్గురూ కడుపుల నిండా గంజి తాగారు. తరువాత కొడుకుని పిల్లలతో ఆడుకోమని గుడిసె దగ్గరే వదలి ఇద్దరూ కూలికి పోయారు

దారి పొడుగునా బక్కోడు కోరిక గురించి తమ దారిద్ర్యాన్ని గురించి చెప్పుకున్నారు. బండమీదొక గుడ్డ ఒంటిమీదొక గుడ్డ అని తమ కుండేది ఒక్కొక్కరికి రెండు గుడ్డపాతలే. సాయంత్రం పని నుంచి ఇంటికిపోయి రాత్రి పులిమి ఆరేసి వేరే గుడ్డలు కట్టుకుంటారు. మరలా సాయంత్రం వీటిని మార్చి వాటిని కట్టుకుంటారు.

అదే పదేన్రూపాయలంటే మొగుడికి రెండు అడ్డకట్టు పంచె లొస్తాయి గదాని యర్రమ్మ అనుకుంటే, యర్రమ్మ కొక నేతకోక వసద్ది గదానేది నడిపయ్య ఆలోచన. వాళ్ళు బాగా సంప్రదించుకొని బక్కోడికి అంత ఖరీదుచేసే బండి కొనియ్యడం అనవసరమనుకొన్నారు. వాడ్ని ఎలాగయినా మాయ మాటలతో బుజ్జగించి సమాధానపరచాలను కున్నారు.

ఆ సాయంత్రం వస్తూ వస్తూ రెడ్డిగారి నడిగి తాటి చెట్టెక్కి తాటి గెల ఒకటి తెగ్గొట్టాడు. తాటిగెల భుజాన పెట్టుకుని ఇంటికి తెచ్చాడు.

"ఒరే బక్కోడా, ఇయ్యాల నీకు బలే బలే ముంజిలు తెచ్చినాన్రా" అన్నాడు నడిపయ్య గెలక్రింద పెడుతూ.

"ముంజిలొద్దు నాకు బండి కావాల. తేలేదా?" అన్నాడు ఏడుపు ముఖంతో.

"ఏడవబాకు నాయనా. అయ్య పొద్దలస్తం పనిజేసి వచ్చినాడు. రేప్పొద్దున బండి తెస్తాంగా" అంది యర్రమ్మ. దాంతో కొంత శాంతించాడు బక్కోడు.

ఆ రాత్రి ముంజిలు తిని తెల్లవారి తనకు రాబోయే బండి గురించి ఆలోచిస్తూ నిద్రపోయాడు.

ఉదయాన్నే నిద్రలేచి తిని పడేసిన రెండు తాటి బుర్రలమధ్య కర్ర బిగించాడు నడిపయ్య. తరువాత తాటిమట్ట తీసుకొచ్చి అందు లోంచి అరచేతి వెడల్పున తాటాకు తీసి దాన్ని కర్రచుట్టూ వంచి రెండు చివర్లు కలుపుతూ పొడవైన తాడితో ముడివేశాడు ఇప్పుడు తాడులాగితే తాటాకు మధ్యనున్న రెండు తాటి బుర్రలు స్పీడుగా తిరుగుతూ ముందుకు పరుగెడుతాయి.

బక్కోడు లేవడమే "బండి....బండి..." అని కలవరిస్తూ లేచాడు

"ఇదిగోరా నాయనా బండి. రెడీగా వుండాది చూడు" అంటూ తాడు పట్టుకుని లాగుతూ చుట్టూ పరుగెత్తి చూపించాడు నడిపయ్య.

"సీ...సీ...ఇదేం బాగాలేదు నాకు మూడు సెక్రాల బండి గావాల"

"ఇది దానికంటే బాగుందమ్మా. ఇది రెండు సెక్రాల బండి"

"ఆహా. ఇది నా కొద్దనే వద్దు" హఠం పట్టాడు బక్కోడు.

"ఆ హతం హతం జ్వరంలోకి దిగింది. రెండు రోజుల్నుంచి నడిపయ్య ఒక్కడే కూలికి పోతున్నాడు. యర్రమ్మ బక్కయ్యను కని పెట్టుకొని ఇంటిదగ్గరే వుండిపోయింది. నడిపయ్య సంపాదనతో మొగుడూ పెళ్ళాలకు అరకడుపులుమాత్రమే నిండుతున్నాయి. పల్లెలో ఇచ్చే కూలి వడ్లు లేదంటే నూకలు.

రోజు రోజుకి వాడి జ్వరం ఎక్కువవుతుందేగాని తగ్గడంలేదు. జ్వరంలో వాడిదొకటే కలవరింత "మూడు సైక్రాల బండి...నామూడు సైక్రాల బండి" వాడికి మూడు సైక్రాల బండి ఎలా తేవాల అనే ఆలోచనలతోనే నడిపయ్య ఊరవతల ఇలా ఆలోచిస్తూ కూర్చుని వున్నాడు.

• • • •

నడిపయ్య ఆలోచల్లోంచి ఇవతలకు వచ్చి ఏదయితే అదయిందని రెడ్డి దగరకు అప్పుకు బయలుదేరాడు. ఒకప్పుడు వాడి బండి కొనడానికి డబ్బులేని నడిపయ్య ఇప్పుడు పిల్లవాడి జ్వరం తగ్గడానికి అప్పుకోసం పోయాడు. పిల్లాడ్ని పట్నం తీసుకెళ్ళితే జ్వరం నయమవుతుందని అతని నమ్మకం. నాటు వైద్యం ఇన్ని రోజులూ ఏం పనిచేయలేదు.

నడిపయ్య నేరుగా వెళ్ళి రెడ్డి కాళ్ళమీద పడ్డాడు. రెడ్డి నడిపయ్య యోగక్షేమాలు విచారించి ఓ విషపు నవ్వు నవ్వాడు. ఓ వంద రూపాయలు అప్పిచ్చి అసలు విషయం చెప్పాడు. విషయం ఏమిటంటే నడిపయ్య ఆరునెలలపాటు రెడ్డి దగ్గర కూలి తీసుకోకుండా పనిచెయ్యాలి. డబ్బు ఇచ్చిందే చాలనుకుంటున్న నడిపయ్య ఆ కాంట్రాక్టుకు ఒప్పుకుని గుడిసె వైపు పరుగెత్తాడు.

మొగుడూ పెళ్ళాలు బిడ్డను భుజాన వేసుకుని అక్కడికి పది మైళ్ళ దూరంలో వున్న పట్నంలోని గవర్నమెంటు హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళారు. రెండు రోజులు వైద్యం చేయించారు. బిడ్డ జ్వరం నుంచి బయటపడ్డాడుగాని రెండు కాళ్ళు పడిపోయాయి. బక్కోడికి పోలియో

అటాక్ అయిందని వాడిని ఇంకా పెద్ద హాస్పిటలుకు తీసుకెళ్ళితే మందిచ్చి మంచి బూట్లిస్తారని చెప్పాడు డాక్టర్.

అంత ఖర్చుపెట్టే శక్తిలేని నడిపయ్య, యర్రమ్మ బిడ్డను భుజాన వేసుకుని ఏడుస్తూ ఇంటికొచ్చారు. వస్తూ వస్తూ నడిపయ్య పట్నంలో మిగిలిన పదిహేను రూపాయలతో మూడు చక్రాల చెక్కబండి కొని తెచ్చాడు నడిచే శక్తిలేని బక్కోడు బండిని పట్టుకొని ఎంతో జాగ్రత్తగా నెట్టుకుంటూ నడవసాగాడు

“భలే...భలే...నా బండి ఎంత బాగా పోతుందో” హుషారుగా అరిచాడు. కాళ్ళలో శక్తి లేకపోయినా కళ్ళలో వెలుగుంది.

యర్రమ్మ భోరున ఏడిస్తే నడిపయ్య ఆగని కన్నీటిని భుజాన ఉన్న తుండుతో కళ్ళొత్తుకున్నాడు.

బక్కయ్యకిప్పుడు పాతికేళ్ళు. వాడి ఈడు వాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకుని ఒక్కొక్కరు ఇద్దరు పిల్లల్ని కని వెంపర్లాడుతూ కూలిపనులకు వెడుతూ వుంటే, బక్కోడు బ్రహ్మచారిగా వుంటూ చిన్న పిల్లల్ని ఆడిస్తూ కాలం గడుపుతున్నాడు వాడు ఊరవతల కాలకృత్యాలు తీర్చుకోను వెళ్ళాలన్నా, ఊళ్ళో గంగమ్మ అంగడికి వెళ్ళి బీడీలు కొనుక్కోవాలన్నా వాడికి మూడుచక్రాలబండే ఆధారం అది వాడికి తోడుగా శాశ్వతంగా వుండిపోయింది.

‘అదికి ఆనాడే ఈ కోరిక తీర్చుంటే ఈనాడు ఇట్టా అయ్యేవాడు కాదేమో’ అని అప్పుడప్పుడు కళ్ళనీళ్ళు పెట్టుకుంటారు, వాడి ముసలి తల్లిదండ్రులు నడిపయ్య, యర్రమ్మ.